AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## కోటగిరి ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, కోటగిరి :** మండల పరిషత్ నూతన అధికారిగా విష్ణు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గ్రూప్–1లో ఎంపీడీవోగా ఎంపికైన ఆయన కోటగిరి మండల ఎంపీడీవోగా నియమితులయ్యారు. సోమవారం విధుల్లో చేరగా, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలం దిస్తానని పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించనున్నారు.





## ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ చెల్లించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు బెనిఫిట్స్ చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుకున్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీపీఎఫ్, జీఐఎస్, ఈఎల్స్, మెడికల్ బిల్లులు, పీఆర్సీ బకాయిలు, ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెన్షన్ బకాయిలు రాక ఎందరో పెన్షనర్లు అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులు కూడా విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బన్సీలాల్, రాజేందర్, శంకర్ గౌడ్, పూర్ణచంద్రరావు, హన్మాండ్లు, ఉమాకాంత్, డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతన్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీలో భారీగా చేరికలు

**అక్షరటుడే, ఆర్మూర్:** బీజేపీలో పలువురు నాయకులు చేరారు. ఆర్మూర్ 8వ వార్డు నుంచి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో అరుణ్ తన 150మంది అనుచరులతో బీజేపీలో చేరారు. ముందుగా భారీ బైక్‌ర్యాలీ చేపట్టగా, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంపీ అరవింద్ నేతృత్వంలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను బీజేపీ కైవసం చేసుకుంటుందని, స్థానిక ఎన్నికల్లో ఆర్మూర్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో ఇతర పార్టీల నుంచి బీజేపీలో భారీ చేరికలు ఉంటాయని, నియోజకవర్గంలో ఉన్న బీజేపీ కార్యకర్తలతో కలిసి భారీ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, పోల్కం వేణు,పెద్దోళ్ల గంగారెడ్డి, కలిగోట్ గంగాధర్, అనిల్ పాల్గొన్నారు.




## రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని రాస్తారోకో

**అక్షరటుడే, ఇందూరు :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ శశిధర్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నగర శివారులోని విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట సోమవారం రాస్తారోకో చేపట్టారు. రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులు ఉద్యమం చేస్తున్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ఏమాత్రం చలనం లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో కళాశాల యాజమాన్యాలు తీవ్రఒత్తిడికి గురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపి, కంతేశ్వర్ జోనల్ ఇన్‌ఛార్జి దుర్గాదాస్, సన్నీ, సిద్ధు, విగ్నేష్, టోనీ, కార్తీక్, హరీష్, అఖిలేష్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

“

**పాఠాలు చెప్పి విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు నిబంధనలు పాటించడం లేదు. పిల్లలు బడికి డుమ్మా కొడితే మందలించాల్సిన ఆయనే ఇష్టారాజ్యంగా సెలవులు పెడుతున్నాడు. ఉపాధ్యాయులు ఎట్టి పరిస్థితుల్లో ప్రజా ప్రతినిధులకు పీఏలుగా ఉండొద్దని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. విద్యాశాఖ సైతం దీనిపై కఠినంగానే వ్యవహరిస్తోంది. కానీ కొందరు తమ తెలివిని ఉపయోగించి బడులకు డుమ్మా కొట్టి పీఏలుగా కొనసాగుతున్నారు.** - అక్షరటుడే, ఇందూరు



# విధులకు డుమ్మా.. పీఏగా పనులు

- ఓ ఉపాధ్యాయుడి నిర్వాకం
- నిబంధనలకు విరుద్ధంగా సెలవులు
- కోర్టుకు చేరిన వ్యవహారం

జిల్లాలోని ప్రజాప్రతినిధికి ఓ ఉపాధ్యాయుడు పర్సనల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు ప్రజావాణితో పాటు జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదులు వెళ్లాయి. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్నారని, అధికారిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారంటూ ఫిర్యాదు చేశారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

### అనధికారికంగా..

ప్రజా ప్రతినిధి వద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్న సదరు ఉపాధ్యాయుడు ఆది నుంచి సెలవుల్లోనే ఉంటున్నారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం మండల విద్యాధికారికి 4 నెలలు సెలవులు ఇచ్చే అధికారం ఉంటుంది. ఆపైన సెలవులు కావాలంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి లేఖను పంపాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు కార్యాలయ సిబ్బంది ఎటువంటి లేఖను అందజేయలేదు. అయినా కానీ బడికి వెళ్లడం లేదు. సదరు ఉపాధ్యాయుడు ప్రజా ప్రతినిధి వద్ద గత రెండేళ్లుగా పీఏగా కొనసాగుతున్నారు. అయితే ఆయన అనధికారికంగా పీఏగా కొనసాగుతుండటం గమనార్హం. సదరు ఉపాధ్యాయుడిపై రెండు రోజుల క్రితం డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి ఫిర్యాదు అందింది. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు ఎంఈవో, సదరు ఉపాధ్యాయుడికి నోటీసులు అందజేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదులు అందించినా స్పందన లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. దీని పై డీఈవో అశోక్‌ను వివరణ కోరగా.. సదరు టీచర్ సెలవులో ఉన్నాడని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఐదేళ్ల పాటు సెలవులో ఉండే అవకాశం ఉందన్నారు. ఆయన 4 నెలలకు ఒకసారి సెలవు తీసుకుంటున్నాడని అలాగే తమకు కోర్టు నోటీసు అందలేదని చెప్పారు.



## శంభునిగుడిలో ఎమ్మెల్యే ధన్‌పాల్ పూజలు

**అక్షరటుడే, ఇందూరు:** కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నగరంలో శివాలయాలు శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. భక్తులు అధికసంఖ్యలో శివక్షేత్రాలను దర్శించుకుంటున్నారు. భక్తితో పూజలు చేస్తున్నారు. ఈ మాసంలో శివుడిని భక్తులు విశేషంగా ఆరాధిస్తారు. సోమవారం రోజు అభిషేకాలు, రుద్రపూజలు, లక్ష బిల్వార్చనలు, కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు ఉదయాన్నే పవిత్ర స్నానాలు చేసి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ దంపతులు సోమవారం నగరంలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం శంభునిగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రతినిధులు ఎమ్మెల్యే దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



## ఇందిరమ్మ ఇళ్లపై ప్రలకు అవగాహన

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని మాచర్లలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో గంగాధర్ ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం, నిర్మాణ దశల ప్రకారం నిధుల విడుదల విధానం, పనుల నాణ్యత గురించి వివరించారు. అనంతరం ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిజమైన అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. బేస్మెంట్ పూర్తయిన వారికి రూ. లక్ష, గోడలు నిర్మించిన తర్వాత మరో రూ. లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ.2లక్షలు, ఇల్లు పూర్తిగా నిర్మించిన తర్వాత మరో రూ. లక్ష చొప్పున మొత్తంగా రూ. 5లక్షలు ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నసీర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లక్కీడ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం సోమవారం నగర శివారులోని భారతి గార్డెన్స్‌లో లక్కీడ్రా నిర్వహించారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ డ్రా కార్యక్రమం నిర్వహించారు. నూతన ఎక్సైజ్ పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పక్కాగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 102 మద్యం షాపులకు గాను మొత్తం 2,786 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఒక్కోషాప్ వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన వారిని ఆహ్వానిస్తూ, వారి సమక్షంలో కలెక్టర్ లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపులను ఖరారు చేశారు. లక్కీడ్రా కోసం వినియోగించిన టోకెన్లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీడ్రా ప్రక్రియ ప్రారంభం నుంచి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. పెద్దసంఖ్యలో దరఖాస్తుదారులు హాజరు కావడంతో టోకెన్ కలిగి ఉన్న వారినే లోనికి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భారతి గార్డెన్స్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోనూ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పోలీసు బందోబస్తును పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. లక్కీడ్రాలో అదృష్టం వరించి వైన్ షాపులు కేటాయించబడిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా ఎక్సైజ్ శాఖ నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, ఇతర అధికారుల పర్యవేక్షణలో షాపుల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా కొనసాగింది.

## పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పోలీస్‌శాఖలో పదోన్నతులు బాధ్యతను పెంచుతాయని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పీసీలకు హెచ్‌సీలుగా ప్రమోషన్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ కానిస్టేబుళ్లు సోమవారం సీపీ సాయిచైతన్యను కలిశారు. ఈ సందర్భంగా ప్రమోషన్ పొందిన హెడ్ కానిస్టేబుళ్లను సీపీ తన కార్యాలయంలో అభినందించారు. అనంతరం సీపీ మాట్లాడుతు పదోన్నతులు పొందిన కానిస్టేబుళ్లు మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

### పదోన్నతుల వివరాలివే..

ప్రమోషన్ పొందిన వారిలో ఏ.లింబాద్రి (రెంజల్ పీఎస్), కె.చిన్నయ్య (కోటగిరి), పి.గణేష్ (నిజామాబాద్ రూరల్), కె.యాదవ్ (మాక్లూర్), ఏ.వరప్రసాద్ (కమ్మర్‌పల్లి), ఎండీ ఆరీఫుద్దీన్ (టౌన్–2), సీహెచ్.శేఖర్ (నిజామాబాద్ పీసీఆర్), డి.శ్రీనివాస్ రావు (నవీపేట్), జి.శ్రీనివాస్ (భీమ్‌గల్), రాంచందర్ (ఇంటెలిజెన్స్ ఓడీ) ఉన్నారు. వీరందరిని పదోన్నతిపై జగిత్యాల జిల్లాకు పంపించారు.

## ప్రజావాణికి 104 ఫిర్యాదులు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 104 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో సాయాగౌడ్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లకు అర్జీలు సమర్పించారు. కాగా.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.






## మాక్లూర్‌లో ప్రభుత్వ పాఠశాలల నూతన భవనాలు ప్రారంభం

**అక్షరటుడే ఆర్మూర్:** మాక్లూర్ మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలకు సంబంధించి నూతన భవనాలను సోమవారం ప్రారంభించారు. నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా తండ్రి బిగాల కృష్ణమూర్తి, తాత బిగాల గంగారం జ్ఞాపకార్థం రూ. కోటి సొంత నిధులు, విద్యాశాఖ నిధులు రూ.5.70 కోట్లతో నిర్మించిన పాఠశాలలను ప్రారంభించారు. రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. కాగా.. ఈ భవనాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనానికి బిగాల కృష్ణమూర్తి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనానికి బిగాల గంగారం అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి బిగాల గణేశ్ గుప్తా, బిగాల మహేశ్ గుప్తా సోదరులను అభినందించారు. కార్యక్రమంలో నిజామాబాద్ మాజీ మేయర్ నీతూకిరణ్, మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## కేజీబీవీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పలు అభివృద్ధి పనులకు ఏఎంసీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య భూమిపూజ చేశారు. మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణలో సీసీ, డైనింగ్ హాల్, తదితర పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి, గ్రామ అధ్యక్షుడు సల్లూరి గణేష్, మాజీ ఎంపీటీసీ గుడిసె అంజమ్మ, నాయకులు మల్లయ్య, గంగారెడ్డి, లక్ష్మణ్, కిషన్, రాజేశ్వర్, రంజిత్, శైలేందర్, నాగరాజ్, జగదీష్, దీపక్, రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అల్ప్రాజోలం పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మోపాల్ మండల పరిధిలో సోమవారం నార్కోటిక్ పోలీసులు దాడులు చేశారు. ఇన్‌స్పెక్టర్ పూర్ణేశ్వర్ ప్రత్యేక టీం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో భారీగా అల్ప్రాజోలం పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌కు చెందిన సాగర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్‌లు మోపాల్ మండలానికి వెళ్తుండగా.. పక్కా సమాచారం మేరకు మోపాల్ మండలంలోని తాడెం వద్ద నార్కోటిక్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 5 లక్షల విలువైన 500 గ్రాముల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిద్దరిపై కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం మోపాల్ ఎస్సైకి అప్పజెప్పినట్లు వివరించారు.

## నగల దుకాణంలో చోరీ

**అక్షరటుడే, బోధన్ :** బోధన్ నియోజకవర్గంలో దొంగలు రెచ్చిపోయారు. నవీపేట్ మండల కేంద్రంలో ఓ నగల దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న ఓ సిల్వర్ మర్చంట్ దుకాణానికి దుండగులు గ్యాస్ కట్టర్ తో షట్టర్‌కు రంధ్రం చేశారు. అనంతరం దుకాణంలోకి చొరబడ్డారు. అయితే బంగారం ఉన్న లాకర్‌ను పగులగొట్టే ప్రయత్నం చేసే సమయంలో రోడ్డుపై అలికిడి వినబడడంతో వెంటనే వెండివస్తువులను ఎత్తుకుని పారిపోయినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ.. దుకాణాదారుల నుంచి ఫిర్యాదు అందలేదని.. అనంతరం దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.







## ఫరీద్‌పేటలో ఉద్రిక్తత..

**అక్షరటుడే, కామారెడ్డి:** పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామంలో సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. పత్తి చేనులో వ్యవసాయ పనులు చేసుకుంటున్న మహిళపై రైస్ మిల్లులో పనిచేసే బీహార్‌కు చెందిన కార్మికుడు ఆదివారం అత్యాచారం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయమే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రైస్ మిల్లును ముట్టడించారు. మిల్లులోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేయగా పోలీసులు చేరుకుని అడ్డుకున్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్థులు మాట్లాడుతూ.. అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గతంలో రైస్‌మిల్లు ప్రాంతంలో పలువురిపై దాడులు జరిగాయన్నారు. మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు రూ. 15 కోట్ల నిధుల మంజూరు చేయడంతో ఆర్మూర్ మున్సిపాలిటీకి మహర్దశ పట్టనుంది. 2007లో ఆర్మూర్ మేజర్ పంచాయతీ నుంచి 3వ గ్రేడ్ మున్సిపాలిటీగా ఏర్పడింది. తర్వాత 2018లో మామిడిపల్లి, పెర్కిట్ మేజర్ గ్రామ పంచాయతీలను ఆర్మూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ రెండో గ్రేడ్ మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. పట్టణంలో ప్రస్తుతం లక్ష పైచిలుకు జనాభా, 70 వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. గడిచిన ఏడాది వ్యవధిలో చెప్పుకోదగ్గ అభివృద్ధి సాధించలేదు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది.

- అక్షరటుడే, ఆర్మూర్



# ఆర్మూర్‌కు మహర్దశ..

### పట్టణాభివృద్ధికి తోడ్పాటు..



రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.15 కోట్లతో కేవలం ఆర్మూర్ పట్టణ అభివృద్ధి, సౌకర్యాల కల్పనకే కేటాయించాం. రూ.15కోట్ల నిధులతో పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం. సీసీ, డ్రైనేజీ, కల్వర్టులు, వరద కాలువలు, పార్కులు, జంక్షన్లను ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

- రాజు, మున్సిపల్ కమిషనర్ ఆర్మూర్

- 15 కోట్ల నిధుల మంజూరు
- వరద కాల్వలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు మోక్షం
- అంబేద్కర్ చౌరస్తా, పెర్కిట్ జంక్షన్ల ఏర్పాటు
- విలీన గ్రామాల్లో పార్కుల నిర్మాణం

రాష్ట్ర ప్రభుత్వం ఆర్మూర్ మున్సిపాలిటీ రూ.15 కోట్లు నిధులు కేటాయించడంతో మున్సిపల్ అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. ముఖ్యంగా పట్టణాన్ని పీడిస్తున్న వరద సమస్య దృష్టిలో ఉంచుకుని సుమారు రూ. 6 కోట్ల నిధులను హౌసింగ్ బోర్డ్, రాంనగర్, యోగేశ్వర కాలనీ, కుక్కల గుట్ట, మామిడిపల్లి హెచ్‌పీ పెట్రోల్ బంక్, అంగడీబజార్ వద్ద వరద కాల్వల ఏర్పాటుకు కేటాయించారు. మరోవైపు అంబేద్కర్ చౌరస్తా జంక్షన్ ఏర్పాటుకు రూ.40 లక్షలు, పెర్కిట్ చౌరస్తా జంక్షన్ ఏర్పాటుకు రూ.కోటి, మున్సిపల్ విలీన గ్రామాలైన మామిడిపల్లి, పెర్కిట్ గ్రామాల్లో రూ.కోటి వ్యయంతో అధునాతన పార్కుల నిర్మాణం, హౌసింగ్ బోర్డ్ పార్క్ మరమ్మత్తులు, వివిధ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణం కోసం రూ. కోటి కేటాయించారు. నిధులు వచ్చిన వెంటనే పనుల ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులు కేటాయించడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీకి నిధులు లేక కొన్నిరోజులుగా సమస్యలు పేరుకుపోయాయి. ముఖ్యంగా పెర్కిట్, మామిడిపల్లి అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిధులు కేటాయించడంతో ఆయా డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అవసరమైన పనులకు టెండర్లు పిలిచి వెంటనే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పనులు త్వరగా చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ఏగుల నర్సింలు పేర్కొన్నారు. మీసంపల్లిలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి, అక్కడి రైతులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర ఏగ్రేడ్ రూ.2,389, బీ గ్రేడ్‌కు రూ.2,369 అందిస్తోందన్నారు. అలాగే సన్న రకం వడ్లకి రూ.500 బోనస్ ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## చిట్టాపూర్‌లో పశువులకు టీకాలు



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. గ్రామంలో ఉన్న 178 ఆవులు, గేదెలకు పశువైద్యాధికారి డాక్టర్ గౌతమ్ రాజు ఆధ్వర్యంలో టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కె.రాజబాబు, గంగమల్లు, రాజశేఖర్, సురేష్, కిషన్ తదితరులు పాల్గొని తమ పశువులకు టీకాలు వేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ప్రవీణ్, ప్రణీత్, గోపాలమిత్రలు మల్లేశ్, షకీల్ సేవలందించారు. పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పశువులను వ్యాధుల నుంచి రక్షించుకోవాలని పశువైద్యాధికారి సూచించారు.



## హింగులాంబిక దేవి ఆలయంలో చోరీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని ఆదర్శనగర్ కాలనీలోగల హింగులాంబిక దేవి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. మూడోటౌన్ ఎస్‌హెచ్‌వో హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. ఆలయంలో ఉన్న మూడున్నర తులాల బంగారాన్ని అపహరించుకు పారిపోయారు. బంగారం విలువ మార్కెట్ రేటు ప్రకారం రూ .3.90లక్షలు ఉంటుందని, బంగారంతోపాటు ఆలయంలో ఉన్న సీసీ కెమెరా డివిఆర్‌ను కూడా దుండగులు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## రాష్ట్రంలో విద్యారంగంపై నిర్లక్ష్యం సరికాదు

**అక్షరటుడే, ఆర్మూర్ :** రాష్ట్రంలో విద్యారంగంపై తీవ్ర నిర్లక్ష్యం నెలకొందని, వెంటనే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ ఛార్జీలు, స్కాలర్‌షిప్‌లు అందించాలని పీడీఎస్‌యూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్మూర్ పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో కనీస సౌకర్యాలు లేవని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ విమర్శించారు. అధ్యాపకుల కొరతతో విద్యార్థులు కళాశాలల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత కొన్ని నెలలుగా హాస్టల్ విద్యార్థులకు మెస్ బకాయిలు రాక హాస్టల్ వ్యవస్థ అధ్వానంగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలవారి మెయింటనెన్స్ ఫీజు ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులపై ఆర్థికంగా భారం పడుతోందన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని అసెంబ్లీలో విద్యార్థుల పక్షాన మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు నిఖిల్, రుచిత పాల్గొన్నారు.



## మృతిచెందిన కార్మికురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

**అక్షరటుడే, బోధన్:** రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పారిశుధ్య కార్మికురాలి కుటుంబానికి న్యాయం చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం విధులు నిర్వహిస్తున్న నాగమణిని సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయాలపాలైంది. గాయపడ్డ ఆమెను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. మృతి చెందిన కార్మికురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మృతురాలికి రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మాహతోకు సమర్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారాన్ని అందేలా చేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## భార్య కాపురానికి రావట్లేదని.. ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**అక్షరటుడే, కామారెడ్డి:** భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఏఆర్ కానిస్టేబుల్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి పట్టణానికి కూతవేటు దూరంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మద్దికుంట గ్రామానికి చెందిన రేకులపల్లి జీవన్ రెడ్డి (37) ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అయితే జీవన్‌రెడ్డికి ముస్తాబాద్ మండలం మొరాయిపల్లి గ్రామానికి చెందిన చందనతో వివాహం జరిగింది. వీరికి మోక్ష, కృతిక ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య గత రెండు మూడేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఏడాది క్రితం చందన తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి ఎన్నిసార్లు అడిగినా కాపురానికి రాలేదు. ఇటీవల విడాకుల నోటీసులు కూడా రావడంతో జీవన్ రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఉదయం 7:30 ప్రాంతంలో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బైక్‌పై ఇంట్లో నుంచి బయలుదేరాడు. ఇంట్లో నుంచి వెళ్లిన జీవన్ రెడ్డి కామారెడ్డి మండలం గర్గుల్ శివారులోని అడ్లూర్ గోదాం వద్ద ఉన్న రాధస్వామి సత్సంగ బ్యాన్ ఆశ్రమం వెనకాల మృతదేహమై కనిపించడంతో గొర్రెల కాపరి పోలీసులకు సమాచారం అందించాడు. దాంతో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, రూరల్ సీఐ రామన్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కొద్దిసేపటి తర్వాత జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అక్కడికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ఆర్టీసీ బస్సు ఢీకొని పారిశుధ్య కార్మికురాలి మృతి

**అక్షరటుడే, బోధన్ :** పారిశుధ్య కార్మికురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన బోధన్ పట్టణంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రిలో మృతి చెందింది. బోధన్ మున్సిపాలిటీలో రాజం నాగమణి పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. సోమవారం ఉదయం ఆమె రోడ్లు శుభ్రం చేస్తుండగా.. బాన్సువాడ వైపు వెళ్తున్న బస్సు ఢీకొంది. అనంతరం ఆమెను కొంతదూరం బస్సు లాక్కెళ్లింది. దీంతో నాగమణికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమె ఒక కాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు వెంటనే స్పందించి ఆమెను బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందింది.






## కాలనీలోని సమస్యలను పరిష్కరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** బోర్గాం(పి)లోని శ్రీ సాయి లక్ష్మీనగర్‌లోకి నిజాంసాగర్ కాలువ ద్వారా సాగునీరు వచ్చి చేరుతుందని కాలనీవాసులు వాపోయారు. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. ఠాణాఖుర్దు నుంచి సాగునీరు కాలనీలోని ఇళ్లముందుకు చేరుతోందన్నారు. దీంతో నడవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో వాహనాలు వెళ్లే పరిస్థితి కూడా ఉండడం లేదని వివరించారు. వినతి పత్రం అందించిన వారిలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషన్, ప్రధాన కార్యదర్శి దేవేందర్, కోశాధికారి సురేష్, జలంధర్, లింగం, శివ, శ్రీనివాస్, సాయి రామ్, సుధాకర్, గోపాల్ తదితరులు ఉన్నారు.